

పచ్చిగోళ్ళ సుధ

“ఏమేవ్... కాంతం... త్వరగారావే... అమ్మాయ్... అమ్మాయ్ కాలుజారిం దే...” వగరుస్తూ గావుకేకపెట్టాడు సుబ్బారావు.

“అయ్యో... అయ్యో... ఎంత పని జరిగిపో యిందండీ... ఈ విషయం నలుగురికీ తెలిస్తే ఇంకేమయినా వుందా? ఎవడికొచ్చిందండీ పొయ్యేకాలం... ఓరిదేవుడో... ఇపుడేంచే యాలి...?” సోకండాలు తీస్తూ నెత్తి బాదు కుంది కాంతం.

“ఏమేవ్... కాంతం... కాలుజారడమం టే...”

‘అలా అరుస్తారేమిటండీ... ఎవరయినా వింటే నవ్వరూ...?’

‘ఓసి నీదుంపతెగ... కాలుజారడమంటే... అది కాదే... మన పెరట్లో నూతి దగ్గర కాస్త పాకుడు ఎక్కువై, దాని మీద కాలు వేసి కాలు జారి పడింది–”

“అంతేనా... మీ చోద్యం కూలా... హడలిచచ్చాను. విషయాన్ని ఎలా వివరించాలో కూడా తెలియదు. మాయదారి మొగుడ్ని కట్టి పడేసాడు మా అయ్య...”

“చాల్లే... సంబడం... ఏ విషయం ముంద యినా ముప్పయ్ఏళ్ళ క్రితం జరిగిన మన పెళ్ళి ఊసు ఎత్తకుండా ఉండలేవు...”

“అవునండీ... మరి మిమ్మల్ని చేసుకున్నం దుకు ముప్పయ్ఏళ్ళు కాదు మూడు జన్మలైనా మర్చిపోను...”

“సరేలే... అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళి దెబ్బలేమయినా తగిలాయేమో... ఆయింట్ మెంట్ రాయి.”

“అదేమన్నా చిన్నపిల్లా... ఆయింట్మెంట్లు రాయడానికి, పిప్పరమెంట్లు తినిపించడాని కీనూ...”

“నువ్వసలు కన్నతల్లివేనా? నీ మనసు ఎలా ఒప్పుతుందే...? మీ నాన్నను కాదు... మా నాన్నను అనాలి... నీ లాంటి దాన్ని నా కాళ్ళకు కట్టినందుకు –

“చండాలంగా కాళ్ళకు కట్టడమేంటి...? ఎవరయినా మెడకు కట్టారంటారు. అందుకే అన్నాను... దేనికీ పనికిరారని”

మెడకు కట్టాడని ఆడవాళ్ళు అనాలి. మగవాళ్ళు కాళ్ళకే కట్టారంటారు. ఎందుకంటే కాలు బయటపెట్టాలంటే... పెళ్ళాం పర్మిషన్ కావాలి అందుకని –

“ఏడ్సినట్టే ఉంది. పర్మిషన్లు – ఎడ్మిషన్లు నాకు తెలియదు – నాకు తెలిసిందల్లా మన సులో ఉన్నది... నోటితో కక్కేయడమే...!”

“సర్లే... మన కక్కులు తర్వాత. ముందు పిల్లని చూడు”

“నాన్నా... నన్నేం చూడనక్కర్లేదు... మీ ఇద్దరూ దెబ్బలాడుకోకుండా ఉంటే చాలు–” అంటూ తన రూమ్లోకి వెళ్ళిపోయింది లావణ్య”.

సుబ్బారావు – కాంతం ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

సరిగ్గా తెల్లవారుజామున ఐదుగంటల యింది. కోడి కూసింది –

అంతే... కోడితో పాటు కాంతం గొంతు కూడా గోడలు దాటింది.

అప్పటికే సుబ్బారావు లేచి ఏదో వ్రాసు కుంటున్నాడు.

“ఏంటీ ఉదయాన్నే గీకడం మొదలెట్టా రు?” మంచం మీది నుంచే కస్సుమంది కాంతం.

“దీన్ని గీకడం అనరు వ్రాయడం అం

టారు" అంటూనే తన పని తను చేసుకుపో తున్నాడు సుబ్బారావు.

"దేనికి రాస్తున్నారు... ఆ లవ్ లెటరూ?"

"ఓసి నీదుంపతెగ... ఈ వయసులో నాకు లవ్ లెటరెందుకే? అయినా నిన్ను చేసుకుని సగం చచ్చిపోయాను... వేరే దాన్ని చేసుకుంటే... పూర్తిగా చస్తాను".

"మరేవిటి రాస్తున్నారట?"

"పత్రికలో కవితల పోటీ చదివాను. ఓ కవిత వ్రాసి పంపుదామని...

"ఆ పత్రిక ఉండాలా... మూసెయ్యాలా...? మీకెన్నోసార్లు చెప్పాను... ఇలాంటి సాహసాలు చేయొద్దని..."

"అబ్బ... కాంతం... అలా అనకే... నేను రాసింది చదువుతాను వినవే..." ప్రాధేయ పూర్వకంగా అడిగాడు సుబ్బారావు.

"బాబోయ్... మీ కవిత వినడమే... మన ఊళ్ళో భూకంపం వచ్చినపుడు కూడా నేనింత భయపడలేదు... చాల్లెండి లేచి తయారయి... ఆఫీసుకు బయలుదేరండి...

"సరేలే... అదేదో... ఆఫీసులో మా ఫ్రెండ్స్‌కి వినిపిస్తాను అంటూ మంచం మీద నుంచి లేచి తయ్యారై ఆఫీసుకు బయలుదేరాడు సుబ్బారావు.

ఆఫీస్‌లో ఇంకా ఆఫీసర్ రాకపోవడంతో ఒక సీటు దగ్గరకు చేరారు సుబ్బారావు, వారి స్నేహితులూ...

"త్వరగా చదవరా బాబూ... మళ్ళీ మన ఆఫీసర్ వస్తాడు." ఫ్రెండ్సంతా ఏకకంఠంతో అరిచారు.

"ఇదిగో చదువుతున్నాను..." అంటూ జేబులోంచి ఓ కాగితం తీసి, చదవడం మొదలు పెట్టాడు.

"పని మనిషికి వంద...
చాకలికి వంద...
వంట మనిషికి వంద...
రాత్రికేమో... వందలకి వంద...
వచ్చే జీతం ఏముంటుంది నా బొంద?"
అందుకే నిర్ణయించుకున్నాను -
పెళ్ళి చేసుకోవాలని -
ఓ శుభ ముహూర్తాన -
లక్షలతో వచ్చింది - నా లక్ష్మి
పనిమనిషి తానే -
చాకలీ తానే -
వంట మనిషీ తానే -
మరి రాత్రికేమో... మేనకే!
ఇలా నా భార్య ఒక్కతే అనుకుంటే -
కలుగుతుంది మీ మీద జాలి -
'నేటి సమాజంలో స్త్రీ' అనుకుంటే -
ఆపగలరు ఘోరకలి!


"వహ్వా... వహ్వా... ఏం రాసావురా.. చాలా బావుంది. నీలో ఇంత కళాతపన వుందని ఈ రోజే తెలిసిందిరా... మన ఆఫీసర్ వింటే... మెచ్చుకుని... ప్రమోషన్ ఇచ్చినా ఇస్తాడురా..." ఒకతను నవ్వుతూ అన్నాడు.

"ఆపరా... నీ గోల... ఇంకా కొన్ని మినీ కవితలున్నాయి. విని అభిప్రాయం చెప్పండిరా..." ప్రాధేయపూర్వకంగా అడిగాడు సుబ్బారావు.

"చదవరా బాబూ... చదివెయ్. మీ ఆవిడకు తప్పినా... మాకు తప్పుతుందా...?"

"అలా అనకండిరా... కళను ప్రోత్సహించాలి"

"కళా... కాకరకాయా... విన్నది కాకుం




డా... నీతులు చెప్తున్నావు..."

"పోనీలేరా... ఈ మినీ కవితలు కూడా విని ఎలా ఉన్నాయో... చెప్తే... పత్రిక్కి పంపిం చేస్తాను...'

"తిరుగుస్టాంపులంటించి ఓ కవరు కూడా పడేయ్... ఎందుకయినా మంచిది" అన్నాడు ఒకడు వెటకరిస్తూ.

"చూసాను ఆమెను ఓరచూపు
పిలిచాను రమ్మని రేపు
వాళ్ళన్నయ్య కాసాడు కాపు
అయ్యింది నా వళ్ళు వాపు"

"ఎక్స్‌లెంట్... ఎక్స్‌లెంట్... చాలా బావుం దిరా. ఈ వయసులో టీనేజ్ కుర్రోడు వ్రాసి నట్టు వ్రాసావ్! నిజంగా నీలో ఇంత రచనా శక్తి ఉందనుకోలేదు" మరొకడి కామెంట్.

"అబ్బబ్బ... మధ్యలో డిస్టర్బ్ చేయొద్దు... మరో కవిత చదువుతున్నా..."

ఇచ్చాను పువ్వు
నవ్వింది ఓ నవ్వు
కలిగింది ఆమెపై లవ్వు
అంతే... వచ్చి వాలింది కౌగిట్లోకి రివ్వు"

"ఒరేయ్... గోపాలం... మన సుబ్బారావుకి ముదిరిందిరో. ఈ కవితలన్నీ నీకు పనికొ స్తాయిరా... నీ ప్రేయసికి వ్రాసి పంపు... వెంటనే నీ లవ్ సక్సెస్... గ్రాండ్ సక్సెస్..."

"పోరా... అంటూ ముసిముసిగా నవ్వుకు న్నాడు గోపాలం."

"ఒరేయ్... మధ్యలో కామెంట్రీ వద్దురా. ఇంకొక్క కవిత మాత్రమే ఉంది.... వినం డిరా..."

"సర్లే చదివెయ్..."

"ఆ... ఇదిగో... చదువుతున్నా -

చూసాను ఆమెనో చోట
వెళ్ళాను ఆమె నడిచేబాట
తీసింది కాలికున్న బాటా
రాలేదు నా నోట మాట!

"ఒరేయ్ సుబ్బారావు... నీ కవితలు భలే ఉన్నాయిరా... యువ హృదయాలను గిలిగింతలు పెట్టేలా ఉన్నాయి. లవర్స్ మెదడ్ని వేడెక్కించేలా ఉన్నాయి - పత్రికల ఎడిటర్లని నవ్వించేలా ఉన్నాయ్... పాఠకులను కవ్వించేలా ఉన్నాయ్... మమ్మల్ని వెర్రెక్కించేలా ఉన్నాయ్... మీ శ్రీమతికి మాత్రం... పిచ్చెక్కించేలా ఉన్నాయి..."

"పోరా... నీ జోక్స్... నువ్వూనూ..."

"అవున్రా... ఎవడి పిచ్చివాళ్ళకానందం... నీ పిచ్చి మేమెందుకు కాదనాలి?... పంపెయ్... వెంటనే పత్రిక్కి పంపెయ్... పోతే... వాడి పత్రికే పోతుంది"

"సర్లేరా... అసలు మీ ముందు చదవడం నాదే తప్పు" అంటూ సుబ్బారావు తన సీట్లోకి వెళ్ళిపోయాడు

సరిగ్గా గడియారం తొమ్మిది గంటలు కొట్టింది - అపుడే సుబ్బారావు ఆఫీసులో అడుగు పెట్టాడు. సుబ్బారావు రావడం చూసి ఫ్రెండ్సంతా సుబ్బారావు చుట్టూ చేరారు.

"ఏరా ఏమయింది?... నీ కవితలు పత్రికలో వచ్చాయా...? లేక తిరుగుటపాలో వస్తే చెత్త కుండీకి బలైపోయాయా...?"

"లేదురా... గ్రాండ్ సక్సెస్... నా కవితలు అచ్చయ్యాయి - నాకు చాలా ఆనందంగా ఉందిరా... పత్రిక వాళ్ళకి ఎలాగైనా కృతజ్ఞతలు తెలుపుకోవాలి. మాలాంటి కొత్త వాళ్ళని ప్రోత్సహిస్తే కదా... పెద్దవాళ్ళం అవుతాం..."

"అవున్రా..." ఫ్రెండ్సంతా సంతోషంగా అన్నారు.

"ఇదిగోరా... స్వీట్ తీసుకోండి... నిజంగా ఈ రోజు చాలా ఆనందంగా వుందిరా... పెళ్ళయిన ఇన్నాళ్ళకు నన్ను మా ఆవిడ కూడా కవిగా గుర్తించింది. "మీకూ తెలివి తేటలున్నాయండోయ్" అంటూ ఆశ్చర్యపోయింది. ఇకపై వంట - ఇంటి పని తనే చేస్తానని ఒప్పుకుంది - నన్ను కవితలు, కథలూ వ్రాసుకోమని ప్రోత్సహించింది.

"హ్యాట్సాఫ్ సుబ్బారావు... హ్యాట్సాఫ్" ముప్పై ఏళ్ళుగా... రాసి, రాసి... ఇన్నాళ్ళకు పత్రికలో స్థానం సంపాదించుకోవడమే కాకుండా... నీ భార్య మనసులో కూడా నువ్వు కవిగా గుర్తింపు పొందావ్... చాలా ఆనందంరా..."

అందమయిన వనిత
మన టైపిస్ట్ సరిత
ఆమెపై వ్రాసాను కవిత
వాళ్ళాయన తీసాడు బడిత

సుబ్బారావు కవిత చెప్పేసరికి ఆఫీస్ స్టాఫంతా గొల్లుమని నవ్వారు - సరిత కూడా ముసిముసిగా నవ్వుకుంది.

సుబ్బారావు ఇంకో కవిత వ్రాయడానికనుకుంటూ... ఆఫీస్ పేపర్స్ ఎవరూ చూడకుండా బేగ్‌లో సర్దుకొంటున్నాడు. ●

## హీరో ఇజం

ఒకసారి సినిమా షూటింగ్‌లో ఓ హీరో గారికి కాలు విరిగింది. చెయ్యి బెణికింది. అయినాసరే! కట్లు కట్టించుకొని మరీ షూటింగ్ లకి, డబ్బింగ్‌లకీ రావడం మొదలెట్టాడు.

రెస్టు తీసుకోకుండా ఇదేంటని ఓ విలేఖరి అడిగితే 'ఫర్ ద ప్రొడ్యూసర్, ఫర్ ద పబ్లిక్' తప్పలేదన్నాడా హీరో.

'హారినీ! ఇట్లాగైనా మీ సిన్మా లేటుగా రిలీజవుతుందీ... అప్పటిదాకా హాయిగా ఉండే వాళ్ళంగా' అని గుంపులోంచి ఎవరో అనేసరికి ఆ హీరో మరిక మాట్లాడలేదు.